"ఇచ్చేవాడి కంటే పుచ్చుకునే వాడు ఎప్పుడూ గొప్ప. నేను మా వాళ్ళకిచ్చిందాని వల్ల ఇప్పుడు నాకు ఒరిగేదేమీ లేదు. నా నించి దానం పుచ్చుకున్న అతని వల్లే నేను పుణ్యాన్ని సంపాదించుకునే అవకాశం, తద్వారా ఉత్తమ గతి పొందే అవకాశం నాకు కలిగాయి. నాకా గొప్ప అవకాశాన్ని కల్పించినందుకు కృతజ్ఞతగా నేను అతన్ని చూడాలనుకుంటున్నాను." జవాబు చెప్పాడా ధనవంతుడు.

## 110. చిన్న మచ్చ - పెద్ద మచ్చ

ఓ సారి అశోకుడు ఓ బౌద్ధ భిక్షువుని అడిగాడు.

"ఓ మతాధికారిలోని చిన్న తప్పు మనకు స్పష్టంగా కనబడుతుంది. కాని ఓ దుర్మార్గుడు చేసే పెద్ద తప్పుని మనం గమనించం. ఈ తేడాకి కారణం ఏమిటి?"

"తెల్లటి వస్త్రం మీది చిన్న మచ్చ కూడా స్పష్టంగా కనబడుతుంది. అదే, అనేక మచ్చలు గల ఇంకో వస్త్రం మీది పెద్ద మచ్చని చూసినా వెంటనే దాన్ని గుర్తించలేం. ఇందువల్లే మతాధికారులు తమ ప్రవర్తన విషయంలో బహు జాగ్రత్తగా వుండాలి." జవాబు చెప్పాడు ఆ బౌద్ధ భిక్షువు.

## 111. మనిషి ప్రవృత్తి

వర్షాకాలం వచ్చేసరికి ఓ రాజధాని నగరం నిండా ఈగలు, దోమలు అధికం అయ్యాయి. రాజధానిని శుభ్రంగా ఉంచాలని ఆలోచించిన రాజు మంత్రిని పిలిచి అడిగాడు.

"ఈగలు, దోమలు వృద్ధి కాకుండా ఉండాలంటే ప్రజల సహకారం కూడా అవసరం.దీనికి ప్రజల బాధ్యత కూడా ఉంది కాబట్టి ఎవరింట్లో అవి ఉంటే వారికి ఈగకి, దోమకి పది పైసల చొప్పున జరిమానా విధిస్తే ఎలా ఉంటుంది?"

"ఒద్దు మహారాజా! దీని వల్ల ప్రజల్లో అసంతృప్తి రగులుకుంటుంది. దీనికన్నా తేలికైన మార్గం ఒకటుంది." జవాబు చెప్పాడు మంత్రి.

"ఏమిటది?" ప్రశ్నించాడు రాజు.

"ఎవరైతే చచ్చిన ఈగని, దోమని తెస్తారో వారికి ఒకోదానికి పది పైసలు చెల్లిస్తామని దండోరా వేయించండి."

రాజు ఆ ప్రకారం ప్రకటనని చేయించాడు. మొదటి రోజు పదివేల మంది ఈగలు, దోమలతో వచ్చారు. లక్ష రూపాయలు వారికి చెల్లించారు. వారంలో నగరంలో ఎక్కడా చూద్దామన్నా ఈగ, దోమ అన్నది కనపడలేదు.

నీతి: మనిషి ప్రవర్తన ఎన్నడూ తన స్వార్థం చుట్టూ తిరుగుతూంటుంది తప్ప ఇతరుల బాగోగులని పట్టించుకోదు. ఏ మనిషి అందుకు భిన్నంగా, ఇతరుల బాగుకోసం ప్రవర్తిస్తాడో అతనే ఆధ్యాత్మిక ప్రగతి పథంలో ఉన్నట్లు.

## 112. కోపానికి కారణం

చాలాకాలం ఎంతో ఆధ్యాత్మిక సాధన చేసిన ఓ సన్న్యాసి భిక్షకోసం ఓ గ్రామంలోని ఓ ఇంటి ముందు నిల్చుని 'భవతీ భిక్షాం దేహి' అని అరిచాడు. ఆ ఇంట్లోంచి బయటకి వచ్చిన ఓ మహిళ అతన్ని చూసి కోపంగా అరిచింది.

"దుక్కలా వున్నావు. పని చేసుకుని బ్రతక్క ఎందుకీ సోమరి జీవితం? వెళ్ళు. వెళ్ళు." నానా మాటలు అన్నదతన్ని.

తన మాటలకి కోపం రాకపోగా ప్రశాంతంగా వెనక్కి తిరిగిన ఆ సన్న్యాసి ప్రవర్తనకి కొద్దిగా ఆశ్చర్యం కలిగి అడిగిందామె.

"నా మాటలకి నీకు కోపం రాలేదా? లేక వచ్చినా అణచుకున్నావా?"

"నాకెందుకు కోపం?" చిరునవ్వుతో ప్రశ్నించాడు అతను.

"ఎవరైనా నన్ను అన్ని మాటలంటే నాకు కోపం వస్తుంది." చెప్పిందామె.